# ఉపాధి ఇచ్చాం.. సారథ్యానికీ అవకాశమిస్తాం

- నాయకత్వంలో యువతకు 66 శాతం ఇస్తాం
- కారుణ్య ఉద్యోగాలిచ్చిన ఘనత కేసీఆర్‌దే
- సింగరేణి కార్మికుల జీవితాల్లో వెలుగులు
- యూనియన్ నేతల భేటీలో ఎమ్మెల్సీ, టీబీజీకేఎస్ గౌరవాధ్యక్షురాలు కవిత
- ఎన్నికల్లో అనుసరించాల్సిన వ్యూహాలపై చర్చ

శ్రీరాంపూర్, డిసెంబర్ 6: సింగరేణి సంస్థలో యువతకు పెద్ద ఎత్తున ఉద్యోగాలు కల్పించామని, అదే స్ఫూర్తితో నాయకత్వ బాధ్యతల్లోనూ అత్యంత ప్రాధాన్యత ఇస్తామని టీబీజీకేఎస్ గౌరవాధ్యక్షురాలు, ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత స్పష్టం చేశారు. సింగరేణి గుర్తింపు కార్మిక సంఘం ఎన్నికల నేపథ్యంలో టీబీజీకేఎస్ అధ్యక్షుడు బీ వెంకట్రావ్, ప్రధాన కార్యదర్శి మిర్యాల రాజిరెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్ కెంగర్ల మల్లయ్య బుధవారం హైదరాబాద్‌లో ఆమెను కలిసి ఎన్నికల్లో అనుసరించాల్సిన వ్యూహాలు, సన్నద్ధతపై చర్చించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ కవిత మాట్లాడుతూ సింగరేణి కార్మికుల్లో 50 శాతం యువ కార్మికులు ఉన్నారని. యూనియన్‌లో వారికి కూడా ప్రాధాన్యత ఇస్తామన్నారు. యూనియన్ నాయకత్వంలో 66 శాతం అవకాశం కల్పిస్తామని చెప్పారు. 1998లో ఆగిపోయిన డిపెండెంట్ ఉద్యోగాల స్థానంలో కారుణ్య ఉద్యోగాల ద్వారా 2018లో కేసీఆర్ తిరిగి పునరుద్ధరించినట్లు గుర్తు చేశారు. దీంతో 16 వేల మంది యువతకు ఉద్యోగాలు లభించాయని తెలిపారు. జాతీయ కార్మిక సంఘాల కారణంగా పోయిన ఉద్యోగాలు బీఆర్ఎస్ ప్రభుత్వం టీబీజీకేఎస్ ఇప్పించిందన్నారు. ఈ ఘనత కేసీఆర్‌కే దక్కుతుందని చెప్పారు. కోలిండియాలో లేని విధంగా కారుణ్య ఉద్యోగాలు కల్పించామన్నారు. సింగరేణిలో మహిళలకు ఉద్యోగాలు కల్పించిన ఘనత కూడా కేసీఆర్‌కే దక్కుతుందన్నారు. సింగరేణిని కాపాడుకోవాల్సిన బాధ్యత యువతపై ఉందని స్పష్టం చేశారు. సంస్థను లాభాల బాట పట్టించడానికి, సంస్థ ఎదుగుదలకు, కార్మికుల సంక్షేమానికి కేసీఆర్ ఎనలేని కృషి చేశారని తెలిపారు. సింగరేణిని కష్టాల నుంచి కాపాడిన బీఆర్ఎస్ అనుబంధ సంఘం టీబీజీకేఎస్‌ను కార్మికులు గెలిపించుకోవాలని పిలుపునిచ్చారు. టీబీజీకేఎస్‌ను గెలిపించుకుంటేనే కార్మికులకు న్యాయం జరుగుతుందన్నారు. గతంలో ఎప్పుడూ లేని విధంగా సింగరేణి సంస్థ నికర లాభాల్లో కార్మికులకు భారీ మొత్తంలో వాటాను పంచారని చెప్పారు. 1999-2000 లాభాల్లో కార్మికులకు కేవలం 10 శాతం వాటా ఇచ్చారన్నారు. తెలంగాణా ప్రభుత్వం ఏర్పాటు తర్వాత 32 శాతానికి పెంచి ఇచ్చామని పేర్కొన్నారు. తద్వారా కార్మికులు గణనీయమైన ఆర్థిక ప్రయోజనం కలిగిందన్నారు. ఉద్యోగ విరమణ వయసు 60 నుంచి 61 ఏండ్లకు పెంచామన్నారు. గతంలో సమ్మె చేస్తే సంస్థ జీతం ఇచ్చేది కాదని చెప్పారు. తెలంగాణ ఉద్యమ సమయంలో 35 రోజుల సకలజనుల సమ్మెలో పాల్గొన్న కార్మికులకు బీఆర్ఎస్ ప్రభుత్వం 35 రోజుల వేతనాలు చెల్లించినట్లు చెప్పారు. కార్మికుల తల్లిదండ్రులకు కార్పొరేట్ దవాఖానల్లో ఉచిత వైద్య సౌకర్యం కల్పించామన్నారు. క్వార్టర్స్‌లో నివాసం ఉండే కార్మికులకు ఉచిత విద్యుత్, బేసిక్‌లో 1 శాతం రికవరీ నిలిపివేయడం జరిగిందన్నారు. కారుణ్య ఉద్యోగం వద్దనుకునే కార్మికుడికి రూ. 25 లక్షలు చెల్లించినట్లు తెలిపారు. కార్మికులకు వడ్డీలేని 10 లక్షల గృహ రుణాలు అందించినట్లు చెప్పారు. కార్మికులకు ఉన్నత చదువులకు ఫీజు రీయింబర్స్‌మెంట్, మెరిట్ స్కాలర్‌షిప్‌లు అందించామన్నారు. కార్మికులకు అన్ని విధాల ఆర్థికంగా సంక్షేమ పరంగా లబ్ధి చేకూర్చిన బీఆర్ఎస్ అనుబంధ టీబీజీకేఎస్‌కు ఓటు వేసి గెలిపించాలని కోరారు.

# హోంగార్డుల సమస్యలు పరిష్కరిస్తాం

- ఆదిలాబాద్ ఎస్పీ డీ ఉదయ్ కుమార్ రెడ్డి
- ఘనంగా హోంగార్డుల రైజింగ్ డే



ఎదులాపురం : ర్యాలీలో పాల్గొన్న జిల్లా ఎస్పీ, డీఎస్పీలు, సీఐలు, హోంగార్డులు

ఎదులాపురం, డిసెంబర్ 6 : పోలీసులతో సమానంగా హోంగార్డులనిస్వార్థంగా పని చేస్తున్నారని, వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని ఆదిలాబాద్ ఎస్పీ డీ ఉదయ్ కుమార్ రెడ్డి పేర్కొన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని పోలీస్ హెడ్‌క్వార్టర్స్‌లో హోంగార్డు జిల్లా కార్యాలయంలో హోంగార్డ్ రైసింగ్ డే కార్యక్రమాన్ని నిర్వహించారు. ముందుగా హోంగార్డ్ యూనిట్ ద్వారా ఏర్పాటు చేసిన గౌరవ వందనాన్ని స్వీకరించారు. హోంగార్డుల జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎస్పీ డీ ఉదయ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ భారత ప్రభుత్వం ప్రతి సంవత్సరం ఈ రోజు హోంగార్డు రైజింగ్ డే గా నిర్వహిస్తున్నదని పేర్కొన్నారు. హోంగార్డులకు పదవీ విరమణ అనంతరం ప్రభుత్వం ద్వారా పెన్షన్ ఉండదన్నారు. హోంగార్డులు పెన్షన్ పథకాల్లో చేరడం చాలా ఉత్తమని పేర్కొన్నారు. అనంతరం హోంగార్డు అధికారులు పోలీసు అధికారులు కలిసి పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. ర్యాలీని జిల్లా ఎస్పీ జెండా ఊపి ప్రారంభించారు. డీఎస్పీలు వీ ఉమేందర్, సీహెచ్ నాగేందర్, పోతారం శ్రీనివాస్, సీఐలు స్వామి, నవీన్, మురళి పోలీస్ అసోసియేషన్ అధ్యక్షుడు పెంచాల వెంకటేశ్వర్లు, హోంగార్డ్ ఆఫీస్ అధికారి రమేశ్ తదితరులు పాల్గొన్నారు..

### సమష్టి కృషితోనే సజావుగా ఎన్నికలు

జిల్లాలోని పోలీసులందరి సమష్టి కృషితోనే సాధారణ ఎన్నికలను సజావుగా సాగాయని ఆదిలాబాద్ ఎస్పీ డీ ఉదయ్ కుమార్ రెడ్డి పేర్కొన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని పోలీస్ హెడ్ క్వార్టర్స్‌లో నెల వారీ నేర సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ ఆదిలాబాద్ జిల్లాకు ఉన్నత స్థానాన్ని కల్పించి ఎన్నికలను సజావుగా నిర్వహించేందుకు కృషి చేసిన పోలీసులకు అభినందనలు తెలిపారు. రానున్న లోక్ అదాలత్‌ను విజయవంతం చేయడానికి కచ్చితమైన ప్రణాళికలను రూపొందించాలని పేర్కొన్నారు. సాధ్యమైనన్ని ఎక్కువ కేసులను పరిష్కరించే దిశగా కష్టపడాలన్నారు. పెండింగ్‌లో ఉన్న కేసుల వివరాలను సిబ్బందిని అడిగి త్వరగా కోర్టులను చార్జిషీట్ దాఖలు చేసి పూర్తి చేయాలన్నారు. గత నెలలో వర్టికల్స్‌లో జిల్లాలో ఉత్తమ ప్రతిభ చూపిన 18 మంది పోలీసు అధికారులు సిబ్బందికి ప్రశంసాపత్రాలు అందజేశారు. ఈ సమావేశంలో డీఎస్పీలు వీ ఉమేందర్, సీహెచ్ నాగేందర్, పోతారం శ్రీనివాస్, సీహెచ్ శ్రీనివాస్ జీ ఏవో భక్త ప్రహ్లాద్, సీఐలు కే సత్యనారాయణ, ఏ అశోక్, ఐ సైదారావు, చంద్రశేఖర్, శ్రీనివాస్, నరేశ్, ప్రేమ్ కుమార్, సతీశ్, డీ సాయినాథ్, ఆర్ఐ సీఐలు టీ మురళి, నవీన్, స్వామి, డీసీఆర్బీ, ఐటీ కోర్, ఎన్ఐబీ, తదితరుల పాల్గొన్నారు.

### మహిళలు సమస్యలపై నిర్భయంగా సంప్రదించాలి

**ఆసిఫాబాద్ ఎస్పీ సురేశ్ కుమార్**

ఆసిఫాబాద్,డిసెంబర్ 6 : జిల్లాలోని మహిళలు, యువతులు ఎలాంటి సమస్యలున్నా నిర్భయంగా పోలీసులను సంప్రదించవచ్చని ఆసిఫాబాద్ ఎస్పీ సురేశ్ కుమార్ బుధవారం ప్రకటనలో తెలిపారు. మహిళల రక్షణ కోసం షీటీం, యాంటీ ఉమెన్ ట్రాఫికింగ్ టీమ్‌లు పనిచేస్తున్నాయని తెలిపారు. విద్యార్థినులు, మహిళలు అన్యాయానికి గురైనప్పుడు భయపడొద్దని, ధైర్యంగా ముందుకు వచ్చి ఫిర్యాదు చేస్తే నిందితుడిపై చర్యలు తీసుకుంటామన్నారు. కళాశాల, పాఠశాలల విద్యార్థులకు ర్యాగింగ్, ఈవ్‌టీజింగ్, పోక్సో, షీటీం, యాంటీ ఉమెన్ ట్రాఫికింగ్‌పై జిల్లాలో అవగాహన కల్పిస్తున్నామని తెలిపారు. జిల్లా వ్యాప్తంగా నవంబర్ నెలలో షీటీం విభాగంలో ఒక్క ఫిర్యాదు నమోదు చేశామని, 39 హాట్ స్పాట్స్ విజిట్ చేశామని పేర్కొన్నారు. చిన్న పిల్లల రక్షణ విషయంలో పోలీసు శాఖ పటిష్టమైన చర్యలు చేపడుతుందన్నారు. మహిళలు ఫేస్‌బుక్, వాట్సాప్, ఇన్‌స్టాగ్రామ్ వినియోగంలో చాలా జాగ్రత్తగా ఉండాలని, ఫొటోలు, వీడియోలు పోస్టు చేసే సమయంలో వ్యక్తిగత భద్రతకు సంబంధించి అన్ని రకాల చర్యలు తీసుకోవాలని సూచించారు. నేరుగా సంప్రదించలేని వారు 87126 70564, 100కు సమాచారం అందించాలని వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని సూచించారు.

# ప్రైవేటు దవాఖానలో యువతి మృతి

- వైద్యుల నిరక్ష్యమే కారణమని కుటుంబ సభ్యుల ఆరోపణ

మంచిర్యాల ఏసీసీ, డిసెంబర్ 6 : మంచిర్యాల జిల్లా కేంద్రంలోని ఐబీ ఏరియాలో గల ఓ ప్రైవేటు దవాఖానలో యువతి చనిపోయిన ఘటన వెలుగులోకి వచ్చింది. పూర్తి వివరాలు ఇలా ఉన్నాయి. హాజీపూర్ మండలం టికన్నపల్లెకు చెందిన మేడం రమ్య (23) యువతి గత ఆదివారం కడుపు నొప్పి రావడంతో ప్రసాద్ సర్జికల్ ల్యాప్రోస్కోపిక్ మెటర్నిటి అండ్ కిడ్నీ సెంటర్ దవాఖానకు కుటుంబ సభ్యులు తీసుకెళ్లారు. రమ్యకు పూర్తి పరీక్షలు నిర్వహించిన వైద్యులు గర్భసంచికి గడ్డ ఉన్నట్లు గుర్తించారు. కుటుంబ సభ్యులు ఆపరేషన్ చేయాలని వైద్యులను కోరారు. మంగళవారం రాత్రి రమ్య కు ఆపరేషన్ చేసి గడ్డను తొలగించారు. బుధవారం ఉదయం రమ్యకు అధికంగా రక్తస్రావం కావడంతో వైద్యం అందించారు. గుండె కొట్టుకోవడం నెమ్మదించడంతో వైద్యనిపుణుడి పిలిపించి చికిత్స చేయించారు. ఆ తర్వాత గుండె కొట్టుకోవడం ఆగిపోయింది. వైద్యులు రమ్య మృతి చెందిందని కుటుంబ సభ్యులకు తెలిపారు. వైద్యుల నిర్లక్ష్యంతోనే రమ్య చనిపోయినట్లు కుటుంబ సభ్యులు ఆరోపించారు. పట్టణ పోలీసులు దవాఖానకు చేరుకొని రమ్య కుటుంబ సభ్యులకు న్యాయం జరిగేలా చూస్తామని చెప్పడంతో మృతదేహాన్ని వెళ్లిపోయారు. దీనిపై ఆసుపత్రి వైద్యుడు డా.అంజనేయ ప్రసాద్‌ను వివరణ కోరగా రమ్యకు సరైన వైద్యమే అందించానని తెలిపారు.



వీల్ చైర్‌లో కూర్చున్న దివ్యాంగుడు

## వీల్ చైర్ అందజేత

నిర్మల్ అర్బన్, డిసెంబర్ 6 : నిర్మల్ ఆర్టీసీ బస్టాండ్‌కు వృద్ధులు, దివ్యాంగులు, రోగులు బస్సు ఎక్కడానికి దిగడానికి వారు పడుతున్న ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని పద్మ చిల్ల పిల్లల దవాఖాన వైద్యులు సాయి కృష్ణ సహకారంతో వీల్ చైర్‌ను బుధవారం డిపో మేనేజర్ ప్రతిమా రెడ్డికి అందించారు. ప్రయాణికులు ఈ వీల్ చైర్‌ను సద్వినియోగం చేసుకోవాలని మేనేజర్ పేర్కొన్నారు. వీరిని ఆదర్శంగా తీసుకుని మరి కొంత మంది ముందుకు రావాలని తెలిపారు. వైద్యులు పూదరి సాయి కృష్ణ, స్టేషన్ మేనేజర్ నారాయణ, శేఖర్, కంట్రోలర్ భోజాగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## బ్యాడ్మింటన్ పోటీలకు ఎంపిక

మంచిర్యాల అర్బన్, డిసెంబర్ 6 : చెన్నై యూనివర్సిటీలో జరిగే సౌత్‌జోన్ పోటీలకు మంచిర్యాలలోని మిమ్స్ డిగ్రీ కళాశాలకు చెందిన బీకాం ఫస్టియర్ విద్యార్థిని ఎన్ అక్షిత ఎంపికైనట్లు కళాశాల ప్రిన్సిపాల్ పీ ఉపేందర్ రెడ్డి బుధవారం తెలిపారు. ఈ నెల ఐదో తేదీన కాకతీయ యూనివర్సిటీ పరిధిలో జరిగిన అంతర్ జిల్లాల బ్యాడ్మింటన్ పోటీల్లో ప్రతిభ కనబర్చి సౌత్ జోన్ పోటీలకు ఎంపికైందన్నారు. జనవరి 10, 11, 12 తేదీల్లో జరిగే పోటీల్లో పాల్గొననుందన్నారు. అక్షిత కళాశాల కరస్పాండెంట్ టీ శ్రీనివాస రాజు, వైస్ ప్రిన్సిపాల్ శ్రీధర్ రావు, డైరెక్టర్ విజయ్ కుమార్, పీడీ నూనె శ్రీనివాస్ అభినందించారు.

## దరఖాస్తుల ఆహ్వానం

ఆదిలాబాద్ రూరల్, డిసెంబర్ 6 : ఆర్టీసీ ఆదిలాబాద్ రీజియన్‌లో ఐటీఐ అప్రెంటీస్ చేయడానికి అర్హత గల అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు రీజినల్ మేనేజర్ సొలెమన్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు ఐటీఐ డీజిల్ మెకానిక్ ట్రేడ్ కోర్స్ పూర్తి చేసిన ఉమ్మడి జిల్లా అభ్యర్థులు జిల్లాలోని ఆయా డిపోల్లో అప్రెంటీస్ షిప్ చేసేందుకు ఆసక్తి గల అభ్యర్థులు వెబ్‌సైట్ www.apprenticeshipindia.org లో ఈ నెల 15వ తేదీలోగా తమ అర్హత వివరాలు నమోదు చేసుకోవాలని సూచించారు.

నమస్తే తెలంగాణ CLASSIFIED

WANTED

jobs Apply Now!

★రామకృష్ణ గ్రూప్ (AP, న్యూఢిల్లీ No.1) శ్రీమంతుల ఇండ్లలో వృద్ధుల/పేషెంట్ల సేవకు ఇంటి/వంట పని, బేబీకేర్ కొరకు M/F వర్కర్లు 12/24 గంటల డ్యూటీ కొరకు కావలెను. ఏజెంట్లకు 5 వేలు కమీషన్. వృద్ధుల/పేషెంట్ల సేవకు వర్కర్లను 24x7 మీ ఇంటి పంపగలము. 9281452762, 9515108830.
NT-314461

★త్రివేణి హోంకేర్, హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్, నర్సులు కావలెను. ఉచిత వసతి, భోజనం. జీతం: 18K. Ph: 9160900024 / 9640400073.
NT-314356-All

CHANGE OF NAME

I, ARGULWAR GOPAL S/O ARGULWAR BHUMANNA, MOTHER NAME ARGULWAR GOURABAI AND WIFE NAME ARGULWAR VIJAYA LAXMI (Old Name) H.NO.1-31, Manjulapur (V), Nirmal (Dist) T.S. hereby declare That I have Changed my name as. **AARGULWAR GOPAL S/O AARGULWAR BHUMANNA, MOTHER NAME AARGULWAR GOURABAI AND WIFE NAME AARGULWAR VIJAYALAXMI** (NEW NAME) H.NO 1-31, MANJULAPUR (V) ,NIRMAL (DIST) ,T.S.

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధము లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

Classified Ads
మీకు కావలసిన సమాచారం కొరకు సులభమైన మార్గం.. మన
నమస్తే తెలంగాణ
క్లాసిఫైడ్స్‌లో ప్రకటన ఇవ్వడం
4 లైన్ల ప్రకటన కేవలం
200/- మాత్రమే
ప్రతి ఎక్స్‌ట్రా లైన్‌కి
50/- మాత్రమే
3+1 స్కీం కలదు
ప్రకటనల విభాగం...
GST 5% వర్తించును
మంచిర్యాల: 91827 77676, ఆసిఫాబాద్: 91827 77679
నిర్మల్: 91827 77671, 91827 77677